
అభివృద్ధికి దూరంగా
నాంపల్లి గుట్ట
- భక్తులకు సౌకర్యాలు కరువు

8

ఎన్నికలు ప్రశాంతంగా
నిర్వహించాలి





వలసల జోరు

- షాకిస్తున్న గులాబీలు
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు
- సిరిసిల్ల బల్దియాలో ఖాళీ అవుతున్న కౌన్సిలర్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే ఆధ్వర్యంలో కాంగ్రెస్ గూటికి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అధికారం మారిపోవడంతో బీఆర్‌ఎస్ నేతల్లో నిరుత్సాహం ఆవరించింది. గులాబీలు కొందరు పార్టీకి దూరం ఉండగా మరికొందరు కండువాలు మారుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీవైపు చూస్తున్నారు. ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు పెరిగాయి. మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'గేట్లు తెరిచామం' అని ప్రకటించడంతో చేరికల్లో ఊపందుకుంది. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికల పరంపర కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు నాలుగు విడతల్లో ఉండడంతో చేరికలు మరింత పెరగనున్నాయి.

బీఆర్‌ఎస్‌కు గడ్డుకాలం

లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్‌ల నుంచి భారీగా మేజార్టీ ఇవ్వాలని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు భావిస్తున్నా క్షేత్ర స్థాయి నాయకుల్లో పట్టుదల వీడినట్లుగా కనిపిస్తోంది. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో అనుకున్న స్థాయిలో బీఆర్‌ఎస్‌కు ఓట్లు రాకపోవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు పూర్తవగా కాంగ్రెస్ అభ్యర్థిపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటి వరకు ప్రకటించిన బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో బీజేపీ వైపే సిరిసిల్ల, వేములవాడ నిలుస్తుందని భావిస్తున్నారు. యువతలో మోదీ హవా కొనసాగుతోంది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769 ఓట్లు, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, వేములవాడ సెగ్మెంట్ నుంచి బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 47,399 ఓట్లు, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు లభించాయి. ఈ సారి బీజేపీ ఓటు బ్యాంక్ పెరుగుతుందని భావిస్తున్నా వేములవాడలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉండడంతో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్ వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఉత్సాహంగా ఉన్నా బీఆర్‌ఎస్‌ను నేతలు వీడుతుండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు మొదలయ్యాయి. జిల్లాలో ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరికలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలోనే మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, సీనియర్ నాయకుడు గాంధీబాబు, బీజేపీ నుంచి కనమేని చక్రధర్‌రెడ్డి చేరగా ఎన్నికల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే వలసలు పెరిగాయి. గంభీరావుపేట మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఎల్లారెడ్డిపేట బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీటీసీలు నేవూరి రవీందర్‌రెడ్డి, ఒగ్గు బాలరాజుయాదవ్, పొన్నం బాలకిషన్, మాజీ సర్పంచులు మందాడి దేవేందర్‌యాదవ్, పొన్నాల మంజుల మల్లారెడ్డి, గొల్లపల్లి మల్లేశం, తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, బీజేపీ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు అనిల్, బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ముస్తాబాద్ మండలం నుంచి కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులు కిషన్‌రావు, కళ్యాణి, యారటి లక్ష్మీ, రేసు లక్ష్మీ, భూక్య దేవేందర్, శ్రీనివాస్, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ యాదగిరి గౌడ్, మాజీ ఎంపీపీ లక్ష్మీ కిషన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు చేరారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి దుబ్బాక స్వేచ్ఛరాజు, బీజేపీ నుంచి రజిత సుధాకర్‌రెడ్డి, కస్తూరి కార్తీక్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్‌లో ‌లుకలు కలు మొదలయ్యాయి. కౌన్సిలర్లు ఒక్కరు ఒక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే కౌన్సిలర్లు గుండ్లపల్లి రామానుజం, జాగీరు శైలు, రెడ్డినాయక్, కుడిక్యాల రవి, వేముల రవి కాంగ్రెస్‌లో చేరారు. మరికొంత మంది కౌన్సిలర్లు చేరికకు సిద్ధమయ్యారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు మాజీ కౌన్సిలర్లు మాజీ ఎంపీటీసీ చల్ల హరికృష్ణ, సుంకరి సాయికుమార్, వేణుగోపాల్, నీరటి శ్యాం, అనిల్ కాంగ్రెస్‌లో చేరారు. పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణతో పాటు మరికొందరు పార్టీలో చేరారు. వీర్నపల్లిలో బీఎస్పీ జిల్లా నాయకులు హరిలాల్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు భూక్య మదన్, తంగళ్లపల్లి మండలంలో బీఆర్‌ఎస్ నుంచి జడ్పీటీసీ పూర్మాణి మంజుల, చీర్లవంచ, చిన్నలాంగాపూర్ ఎంపీటీసీలు నలువాల రేణుక, భైరినేని రాము, నేరేళ్ల సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మంజుల, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. వేములవాడలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పుల్కం రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు బింగి మహేష్, వంగల దివ్య, ఇప్పపూల అజయ్, ముప్పిడి సునంద, గూడూరి లక్ష్మీ, బీజేపీ నుంచి తిరుమలరెడ్డి కవిత, అన్నారం ఉమారాణి, కో ఆప్షన్ సభ్యులు శ్రీలక్ష్మీ, బాబున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహ్మద్, సింగిల్ విండో డైరెక్టర్ తోట రాజు, మాజీ కౌన్సిలర్ లావణ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, తెలుగుదేశం నాయకులు రాంబాబుగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. వేములవాడ అర్బన్ నుంచి నాంపల్లి సింగిల్ విండో చైర్మన్ భీంరెడ్డి సల్మాన్‌రెడ్డి, చీర్లవంచ ఎంపీటీసీ వనపర్తి దేవరాజు, సింగిల్ విండో డైరెక్టర్లు నాగరాజు, చిలువేరి సత్తయ్య చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందే బీజేపీ నుంచి వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం బీఆర్‌ఎస్‌లో చేరారు. కోనరావుపేట నుంచి కొలనూర్ మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, కొండాపూర్ ఎంపీటీసీ పల్లె మంజు, పల్లిమక్త మాజీ సర్పంచ్ అంజయ్య బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇదే వరుసలో బోయినపల్లిలో ఎంపీటీసీలు అక్కనపల్లి ఉపేందర్, కొనకటి శిరిష, జగ్గారావుపల్లి మాజీ సర్పంచ్ సౌందర్య కాంగ్రెస్ చేరారు.



మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్ (ఫైల్)

పార్టీకి దూరంగా..

కాంగ్రెస్ అధికారంలోకి రావడం, బీఆర్‌ఎస్ నేతలపై ఉన్న అసంతృప్తితో శ్రేణులు బీఆర్‌ఎస్‌కు దూరంగానే ఉంటున్నారు. సమావేశాలకు హాజరు కావడం లేదు. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు కూడా బీఆర్‌ఎస్ పార్టీని వీడనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల కౌన్సిలర్లను బుజ్జగిస్తూ టూర్లు కూడా తిప్పారు. వీరితోపాటు బీఆర్‌ఎస్‌లో కీలకంగా పనిచేసిన పలువురు నాయకులకు సరైన గౌరవం దక్కడం లేదని కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ నేతలు వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల తరువాత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనే చురుకుగా పనిచేస్తే స్థానిక సంస్థల్లో అవకాశం ఉంటుందని భావించి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ వైపు సక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి



బహుమతులను అందజేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, మార్చి 22: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లో నిర్వహించే క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాగ్యరేఖ ఆధ్వర్యంలో పాఠశాలల క్యాచ్‌మెంట్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీధర్, ఎంఈవో రఘుపతి, ఉపాధ్యాయులు సలావుద్దీన్, కీర్తి, లచ్చయ్య, పరమేష్, రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాసరావు, భారతి, వెంకన్న, సువర్ణ, రజిత, హరిప్రసాద్, వేణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టును పరిశీలించిన నాబార్డు బృందం



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న డీజీఎం

తంగళ్లపల్లి, మార్చి 22: హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టును నాబార్డు బృందం పరిశీలించింది. శుక్రవారం మండలంలోని జిల్లెల్ల శివారు బాబు జగ్జీవన్ రావు వ్యవసాయ కళాశాలలో నాబార్డు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టును నాబార్డు డీజీఎం స్వాతి తివారి బృందం పరిశీలించింది. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం జయప్రకాష్, కరీంనగర్ క్లస్టర్ డీడీఎం మనోహర్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లు భవ్య సంతోష్ తదితరులు ఉన్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, మార్చి 22: మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయంలోని హుండీని లెక్కించారు. ఆలయ ప్రాంగంలో శుక్రవారం ఆరు నెలలుగా ఉన్న హుండీ లెక్కింపులో రూ.6 లక్షల 64 వేల 130 నగదు, 18 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి లభించినట్లు ఆలయకమిటీ సభ్యులు, అధికారులుతెలిపారు.

స్కూల్ యూనిఫాం ఉత్పత్తికి ముందుకు రావాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 22: సమగ్ర శిక్ష డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన చెక్ షర్ట్ యూనిఫాం క్లాత్‌ను రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి గల కార్మికులు టెక్స్‌టైల్ పార్కులోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సంప్రదించాలని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టెక్స్‌టైల్ పార్కులో స్కూల్ యూనిఫాం షర్ట్ క్లాత్‌కు ఆర్డర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మీటరుకు రూ.4.25 పైసలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

సిరిసిల్ల క్రైం, మార్చి 22: సిరిసిల్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ శుక్రవారం ముగిసింది. సిరిసిల్ల బార్ అసోసియేషన్ హాలులో ఈనెల 28న పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు ఏర్పాట్లు చేస్తున్నారు. అధ్యక్ష స్థానానికి త్రిముఖ పోటీ నెలకొంది. నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం అధ్యక్ష స్థానానికి డి. సంజీవరెడ్డి, జె. శ్రీనివాసరావు, ఎస్. వసంతం పోటీ పడుతున్నారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి టి. వెంకటి, వి. గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి స్థానానికి బి.నాగరాజు గౌడ్, పసునూరి మధు, కోశాధికారి స్థానానికి బిట్ల విష్ణు, చీకట్ల వెంకటయ్య, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శికి గుడ్ల కిషన్, మొగిలి రాజు, గ్రంథాలయ కార్యదర్శి స్థానానికి ఎ.సురేశ్‌గౌ ప్రసాద్, జి.శశాంకం పోటీ పడుతున్నారు. అధ్యక్ష స్థానం తప్ప మిగతా అన్ని స్థానాలకు ద్విముఖ పోటీ నెలకొంది. సిరిసిల్ల బార్‌లో దాదాపు 135మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 22: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పుట్టి రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు లింగాల సందీప్ శుక్రవారం పరామర్శించారు. 25 కిలోల బియ్యం అందించారు. రవి పిల్లల చదువు కోసం సహాయ సహకారాలను అందిస్తానన్నారు. రాములు, రాహుల్, సాయిచంద్, ఉదయ్, రాకేష్, సురేష్, దేవేందర్ ఉన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మార్చి 22: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు అనేక రకాలుగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత వారికే చెల్లిందన్నారు. రూ.6 లక్షల కోట్ల అప్పు ఉన్నా సంక్షేమ పథకాల అమలుకు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదన్నారు. మహిళాలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, గృహ జ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు వంటివి నిదర్శనమన్నారు. రైతు భరోసాపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు ఐదు ఎకరాలోపు ఉన్న రైతులకు రైతుభరోసా ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ఏప్రిల్ నాటికి రైతుబంధు ఇచ్చిందని, కాని ప్రస్తుత ప్రభుత్వం మార్చిలోనే రైతు భరోసా ఇస్తోందని అన్నారు. గతంలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, మళ్లీ ప్రజాపాలనలో 200యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికులను ఏమాత్రమూ పట్టించుకోలేదన్నారు. నేడు మేనిఫెస్టోలో చెప్పినట్టుగా గల్ఫ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందిన బాధిత కుటుంబలకు మర్రిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో రూ.5లక్షల పరిహారం అందజేశామన్నారు. ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని కసీఆర్ ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ వారు డబ్బుతో గెలవాలని చూస్తున్నారన్నారు. మొన్నటి రోజున ప్రతిమ మల్టీప్లెక్స్‌లో రూ.6 కోట్ల 67 లక్షలు దొరికాయన్నారు. ఆ డబ్బు తనది కాదని, తన బంధువులది కాదని ప్రమాణం చేసే దమ్ము వినోద్ కుమార్‌కి ఉందా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ గెలుస్తుందని సర్వేలు చెబుతుండడంతో జీర్ణించుకోలేకపోతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్న డబ్బుతో ఓట్లు కొనాలని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తోడ్పాటు అందిస్తారన్నారు. నర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దొబ్బల శంకర్, అనారోగ్యంతో మృతి చెందిన పాకనాటి చంద్రయ్య కుటుంబ సభ్యులను ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ఎర్రం శ్రీమన్నారాయణ, ఇల్లంతకుంట గణేష్, మ్యాకల గణేష్, సంటి ఎసుదాసు, శ్రీనివాసరెడ్డి, గంగధర్, జలపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్, మార్చి 22 : కుమ్మరుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ పట్టణ శాలివాహన సంఘం సభ్యులు ఏదునూరి గోపి, ఐలపురం సంజీవ్, ఏదునూరి భాను, ఐలపురం రజ, రాజు, యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. శాలివాహన చక్రవర్తి శేషని అనుగ్రహంతో అయోధ్యలో కుమ్మరి ఇంట్లో జన్మించారన్నారు. శాలివాహన చక్రవర్తి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. 1076 జీవోను అమలు చేయాలన్నారు. చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. శాలి వాహన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన

సిరిసిల్ల టౌన్, మార్చి 22: కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలకు నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బార్న్ డిసీజెస్ కంట్రోల్(ఎన్‌సీవీబీడీసీ)కార్యక్రమంలో భాగంగా కీటక జనిత వ్యాధుల నివారణపై ఒక్కరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాములు మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా ఫైలేరియా, ఎంఏఆర్‌బైయా, జపానీస్ ఇన్ సఫిలిటీస్ వ్యాధులను అరికట్టాలన్నారు. అనంతరం వ్యాధుల నివారణపై ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో డాక్టర్ రజిత, డాక్టర్ నాయిమ్‌జాన్, సిబ్బంది లింగం, మోహన్, రాజ్‌కుమార్, బాలయ్య, భూమయ్య, సోనీ మనీ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

తంగళ్లపల్లి, మార్చి 22: వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో వీర బుచ్చయ్య ఆదేశంచారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఈ నెల 31లోగా ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. తడి, పొడి చెత్త సేకరించాలని, కంపోస్ట్ షెడ్డుకు తరలించి డీ కంపోస్టుగా మార్చి ఎరువు తయారు చేయాలని సూచించారు. ఎరువుతో గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలంలో ప్రతి ఇంటికీ నీటి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నీటి సమస్య తలెత్తితే 24 గంటలలో పరిష్కరించాలన్నారు. వృత్తి వ్యాపార లైసెన్సులు లేని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జోగం రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీవో

అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం

- శిథిలావస్థలో పక్కా భవనం



శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం

కోనరావుపేట, మార్చి 22: కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పగిలి సిమెంట్ ముక్కలు కింద పడుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనకు గురైన గ్రామపంచాయతీ పాలనకు ఓ అద్దె భవనాన్ని తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కాకపోవడంతో చేసేది ఏమీ లేక అద్దె భవనంలోనే కార్యకలాపాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

ఇటిక్యాలలో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులుగావించి ఆలయం చుట్టూ రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు గంగారెడ్డి, నారాయణ గౌడ్, సామల్ల లావణ్యవేణు, నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రఘునాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారెస్పీ కాలువలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలో పడి మానసిక, శారీరక వైకల్యం గల జిల్లాల నవీన్ (28) అనే యువకుడు మృతి చెందాడు. నవీన్ గ్రామ శివారులోని చర్చికి ఆదివారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందినట్లు రాత్రి 8:30 గంటలకు గుర్తించారు. కాలువ వద్దకు మల విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని అన్న సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

రాయికల్, మార్చి 25: రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయికల్‌కు చెందిన సూర్య, కిరణ్, అభి, సన్నీతో పాటు మరి కొందరు మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు, ఆస్పత్రి సిబ్బందిపై దుర్భాషలాడుతూ బెదిరించారు. డ్యూటీ డాక్టర్ ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

ధర్మపురిలో ఉగ్రనారసింహుడి డోలోత్సవం

● వైభవంగా బ్రహ్మోత్సవాలు ● మొక్కులు తీర్చుకున్న భక్తులు


ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి డోలోత్సవం


ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి తెప్పోత్సవం


ధర్మపురిలో స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూలైను

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర) తెప్పోత్సవం, డోలోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, నవీన్ మధ్యాహ్నం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన స్వామివారలను కూర్చోబెట్టి, బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామ స్మరణ చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరు మహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామి వారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సనాతన సాంప్రదాయ రీతిలో అర్చకులు స్వామి వారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామి వారలపై బుకాగులాలు చల్లి కట్న కానుకలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. గతంలో కన్న భక్తుల సంఖ్య అధికంగా తగ్గి పోయింది. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో శోభిల్లింది. రాత్రివరకు ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్ సహా పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లసెట్టి సుజాత, కొమురెల్లి పవన్ కుమార్, సేదునూర్ శ్రీధర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ ఆర్యవైశ్య వర్తక సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ, పుట్ట బంగారం నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామివారల కల్యాణ, తెప్పె, డోలోత్సవాలను నిత్యం వేలాది మంది భక్తులు తిలకించారు. అన్నదానం సమయంలో శెరిపల్లి కావేరి అనే భక్తురాలు బ్యాగ్, ఫోన్, పోగొట్టుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌కు దొరకగా భక్తురాలు ఆచూకీ కనుగొని అమెకు అప్పగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాల వద్ద లోక క్షేమార్థం సుదర్శన హోమం నిర్వహించారు. ఐదవ రోజు ఆలయానికి రూ 11,26,000 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.4,84,463 లభించగా లడ్డు, ప్రసాదాల ద్వారా రూ. 4,94,885 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 1,46,652 విరాళాలు సమర్పించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మపుష్కరిణి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయి.

రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 25: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్ తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్సూరెన్స్, నెక్సా మోటార్స్, బీవీఆర్ సొల్యూషన్స్,శాశ్వత డెవలపర్స్, ఆనంద నిలయం డెవలపర్స్ వారు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రాడ్యుయేట్, పీజీ 2021,22,23 ప్రస్తుత చివరి సెమిస్టర్ చదువుతున్న కళాశాల, ఇతర కళాశాలల అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అర్హులైన వారు వారి రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, కాశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ వద్ద జరుగుతుందని తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని బహిర్భూమికి వెళ్లిన యువకుడు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నర్ర నగేష్ (21) అనే యువకుడు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. వీరాపూర్ రోడ్డులోని వ్యవసాయ బావి వద్దకు బహిర్భూమికి వెళ్లి బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. స్నేహితులకు ఈత రాకపోవడంతో వెంటనే యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి బావిలో గాలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని రెండు గంటల పాటు గాలించగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి


రాజకుమారి (ఫైల్)

మల్యాల, మార్చి 25: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మల్యాల మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజకుమారి(43) అనే మహిళ ఈ నెల 22న కుటుంబసభ్యులతో కలిసి కారులో వెలుతుండగా బెజ్జంకి సమీపంలో లారీ ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు దాదాపు రూ.6లక్షలకు పైగా అవసరం కాగ నిరుపేద కుటుంబం కావడంతో ఆమె కొడుకుతో పాటు పలువురు యువకులు సోషల్‌మీడియా ద్వారా సాయం కోరారు. దాతలు సాయం అందిస్తున్న తరుణంలోనే పరిస్థితి విషమించి రాజకుమారి మృతి చెందింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

మల్యాల, మార్చి 25: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో గల వీఆర్‌కే కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. కొడిమ్యాలకు చెందిన దండుగుల శేఖర్ తన భార్య ఇద్దరు చిన్నారులతో కలిసి ద్విచక్రవాహనంపై వెలుతుండగా వీఆర్‌కే కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అదుపు తప్పి వస్తున్న కారును తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఢీకొనడంతో శేఖర్‌తో పాటు అతని కూతురు సాయివర్శిత, కుమారుడు రుద్రాంశ్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సాయివర్శిత కొద్ది దూరంలో ఎగిరిపడడంతో తలకు గాయాలు కాగా గాయపడిన వారిని చికిత్స కోసం 108లో జగిత్యాలకు తరలించారు.

యువకుడి ఆకస్మిక మృతి

గంగాధర, మార్చి 25: గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన వేముల మురళి(42) సోమవారం ఇంట్లోనే ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే మురళి మృతికి షాపు యాజమాని కారణమంటూ అతడి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేశారు. దీనిపై ఎస్ఐ కిరణ్‌రెడ్డిని వివరాలు కోరగా.. మధురానగర్‌కు చెందిన వేముల మురళి సోమవారం వేకువ జామున నిద్రలోనే మృతి చెందాడు. తెల్లవారినా లేవకపోవడంతో అతని భార్య గౌతమి లేపినా ఎలాంటి స్పందన లేదు. విషయాన్ని మురళి అన్న రమేష్, తల్లికి తెలపగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు.మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మురళికి చెందిన భూమి విషయంలో పంచాయతీ జరుగుతోంది. భూమి విషయం ఎప్పటికీ తెగకపోవడంతో మానసికంగా ఆందోళన చెంది మృతి చెంది ఉంటాడని బంధువులు, గ్రామస్థులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్, మార్చి 25: జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో హోలీ పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన రమ అనే మహిళ, అదే గ్రామానికి చెందిన బోగు రాకేష్ ల మధ్య పాత గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం గ్రామంలో యువకులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈక్రమంలో బోగు రాకేష్ అనే యువకుడు మేడిశెట్టి రమ ఇంటిలోపలకి కోడి గుడ్డు విసిరారు. ఇదే విషయమై తన ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరివేశావు అని రాకేష్ ను రమ కుమారుడు రిషి నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగి గొడవకు దారి తీసింది. రిషి, రాకేష్ లు ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గొడవను ఆపేందుకు వెళ్లిన రమపై రాకేష్ మెడపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. రమ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాయిలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం

● మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి25: ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక ధారుడ్యం అవసరమని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సోమవారం నగరంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలలో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులు వివిధ స్థాయి బెల్టులను సాధించినట్లు ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శారద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ విద్య ప్రాముఖ్యతను గుర్తించి దీనికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందేలా కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్

మల్యాల, మార్చి 25: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈవో వెంకటేష్‌పై దేవాదాయ శాఖ కమిషనర్ గత శనివారం సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టగా ఉద్యోగులు, అర్చకులు అభినందించారు

యవతిని ట్రాప్ చేసిన ఏఎస్సై వీఆర్‌కు అటాచ్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం, మార్చి 25: ఇబ్రహీంపట్నం ఏఎస్సై రాములుపై ఉన్నతధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఠాణాకు వచ్చిన యువతిని ట్రాప్ చేసిన ఏఎస్సై' కథనం ప్రచురితం కాగా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ స్పందించారు. ఏఎస్సై వ్యవహారం సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టారు. ఏఎస్సై వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశం కావడంతో ఏఎస్సై రాములును జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సమగ్ర విచారణ అనంతరం ఏఎస్ఐపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఠాణాకు వచ్చిన మహిళలకు భద్రత కల్పించాల్సిన పోలీస్‌లే ఈ విధంగా ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతధికారులు దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్/కోనరావుపేట, మార్చి 25: భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జరిగింది. సిరిసిల్ల పట్టాణానికి చెందిన గూడూరు సాగర్ (26) కారు డ్రైవర్‌గా పనిచేసున్నాడు. మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన గూడూరు అనూష, సాగర్ ఇరు కుటుంబాలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. పిల్లలు పుట్టకపోవడంతో పాటు సరైన కూలి పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాడు. సాగర్ తల్లిదండ్రులు చంద్రకళ, బాబు దంపతులు ఉపాధి కోసం కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఓ ఇంటిలో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు పిల్లలు పుట్టడం లేదని 20 రోజుల క్రితం సాగర్‌తో భార్య అనూష గొడవ పడి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తల్లిదండ్రులు ఉంటున్న కొలనూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడే నిద్రించి తెల్లవారుజామున వారు ఉంటున్న ఇంటిపై ఉన్న సలాకకు చీరతో ఉరేసుకున్నాడు. సాగర్ తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మరోవైపు పండుగ పూట మిత్రుడు సాగర్ చనిపోవడంతో స్నేహితులతో పాటు ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దీ పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న త్రిరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిసాయి. శివకల్యాణ మహోత్సవాలకు ముందుగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఉదయం, సాయంత్రం రాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపం ఊయలలో ఉంచి డోలోత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివకల్యాణోత్సవాలు

ఈ నెల 27వ తేదీ బుధవారం నుంచి శివకల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 28వ తేదీ గురువారం పార్వతీ రాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హోలీ వేడుకల్లో విషాదం


కృష్ణవంశీ(ఫైల్)


శివకుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 25: అప్పటి వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద కేళిలో మునిగి తేలిన ఆ యువకులు ఇద్దరు నిమిషాల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. హోలీ సంబరాలు చేసుకున్న స్నేహితులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలుసుకుని తోటి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హోలీ పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. పోలీసులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం...

కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్ రోడ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పాను గంటి కృష్ణ వంశీ(24) అక్కడికక్కడే మృతి చెందగా గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న పొల్ల శివకుమార్(24) ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కృష్ణవంశీ, పొల్ల శివకుమార్‌లు సోమవారం ఉదయం నుంచి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్నేహితులతో కలిసి భోజనాలు ముగించారు. కృష్ణవంశీ, శివకుమార్ సాయంత్రం 6 గంటలకు జ్యోతినగర్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఐటీ టవర్ వద్ద బైక్ రోడ్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరు డివైడర్‌పై ఉన్న సైన్‌బోర్డు స్తంభానికి తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణవంశీ అక్కడికక్కడే మరణించగా శివకుమార్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. మానకొండూర్ మండలం గద్దెపాకకు చెందిన కృష్ణవంశీ ప్రస్తుతం శ్రీనగర్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కృష్ణవంశీ పారామిలటరీ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ వారం రోజుల కిందటే కరీంనగర్‌కు వచ్చాడు. ఆయన తండ్రి పెయింటర్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటుండగా తల్లి వంట పనులు చేస్తూ జీవిస్తున్నది. ఒక సోదరుడు ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన శివకుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్నాడు. హోలీ కావటంతో కృష్ణవంశీ, శివకుమార్‌లు స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బైక్‌పై వెళుతూ మృత్యువాత పడ్డారు. కృష్ణ వంశీ, శివకుమార్‌ల మరణవార్త తెలుసుకున్న వారి స్నేహితులు, బంధు వులు ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.

వానర 'దండయాత్ర'


గుంపులుగా పంట చేనులోకి వెళ్తున్న కోతులు

మల్యాల, మార్చి 25: సమూహాలుగా గ్రామాలు, పంట చేలపై దండయాత్ర చేస్తున్న కోతులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద అధికం కాగ పంట చేలను విడిచి పెట్టడం లేదు. గుంపులుగా పంటలపై దాడి చేస్తూ నష్టం చేస్తున్నాయి. దీంతో కోతులను నివారించలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మల్యాల శివారులో గుంపులుగా వచ్చిన కోతులు పంటలపై దాడి చేశాయి. వాటిని తరమడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక లారీల పట్టివేత


అధికారులు పట్టుకున్న ఇసుకలారీ

ముత్తారం, మార్చి25: మండలంలోని ఓడేడులో మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా మూడు లారీలలో ఇసుక నింపి తరలిస్తుండగా లారీలు దిగబడ్డాయి. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సోమవారం సిబ్బందితో వచ్చి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే మూడు లారీలను ఒక జేసీబీని సీజ్ చేసి పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 25 : కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులు వేల్పుల వెంకటరమణ, వేల్పుల తిరుపతిలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

● రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మంథని, మార్చి 25: స్థానిక సీఆర్‌కే అపార్ట్‌మెంట్ లోని ఫ్లాట్ నెం. 306లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు ఈ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నారు. ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అతని భార్య శ్రీలత కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంథని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం, ఫైర్‌మెన్ శ్రీనివాస్, డ్రైవర్ కం ఆపరేటర్ రమేష్, కోండ్ర నాగరాజు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 50 వేల నగదు, రూ. 1.50 లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది.

షార్ట్ సూర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం


కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఈరీ కైలాసం ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుడు కైలాసం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో సామగ్రితో సాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే బీరువాలో ఉన్న బంగారు అభరణాలు మంటల్లో కరిగిపోయినట్లు బాధితులు తెలిపారు. బీరువాలో ఉన్నా రూ. 30 వేలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుంటుంబాన్ని ఎంపీపీ పడిగెల మానసరాజు పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ బాధితులను పరామర్శించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కవాతులో పోలీసు బలగాలు

కోనరావుపేట మార్చి 25 : పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం పోలీస్ బలగాల కవాతు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

అన్నదాతలు ఆందోళన చెందవద్దు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: అకాల వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలు ఆదుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్ల వానకు ఎల్లారెడ్డిపేట, గంబీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో నష్టపోయిన పంటల వివరాలను సేకరించేందుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా సర్కారు చర్యలు చేపడుతోందన్నారు. ప్రతిపక్షంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు వచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వ్యవసాయానికి విద్యుత్‌ను అందించడంతో పాటు అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోనుందన్నారు. ధాన్యం కొనుగోలు చేయకముందే బోనస్ చెల్లించడం లేదని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

కౌశిక్ రెడ్డికి మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి లేదు

కోనరావుపేట, మార్చి 25 : మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్ అన్నారు. కోనరావుపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయకపోతే చచ్చిపోతానని ప్రజలను బెదిరించి గెలిచిన కౌశిక్ రెడ్డికి మంత్రి పొన్నంను విమర్శించే హక్కు లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నందు గౌడ్, మానక సత్యం, లింబయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట సర్కిల్ పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాలకు చెందిన పాస్టర్ల సమావేశం సోమవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాజేశ్, ఉపాధ్యక్షుడిగా నతానియల్, కార్యదర్శిగా హిజ్కియా, సంయుక్త కార్యదర్శిగా దేవానంద్, గౌరవ అధ్యక్షుడిగా రత్నాకర్, కోశాధికారిగా యేసు దాస్, సలహాదారులుగా అబ్రహం, క్రీస్తుదాస్, పౌలు, సామ్యూల్, ఐజయ్య ఎన్నికయ్యారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు



ఇల్లంతకుంటలో హోలీ వేడుకల్లో యువకులు



ఎల్లారెడ్డిపేటలో..



వేములవాడ నందికమాన్ వద్ద గ్రామస్తులు

- ఆనందోత్సాహాల మధ్య వేడుకలు
- రంగుల్లో మునిగి తేలిన చిన్నాపెద్ద

ఇల్లంతకుంట, మార్చి 25: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఉదయమే యువకులు రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అధికారుల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హోలీ వేడుకలకు తరలివెళ్లారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం తోపాటు బొప్పాపూర్, నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి, కోరుట్లపేట, రాజన్నపేట, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, బాకురుపల్లితండా, తిమ్మాపూర్, గుండారం, పదిర, వెంకటాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు రంగులను చల్లుకున్నారు. ఎంపీపీ రేణుక, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రామచందర్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ఎంపీడీవో సత్తయ్య ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి :వీర్నపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఎస్ఐ రమేష్ శుభాకాంక్షలు తెలిపారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రం తో పాటు అన్ని గ్రామాల్లో హోలీ సంబరాలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పడిగెల మానసరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. పద్మనగర్‌లో ఆదర్శ యూత్ క్లబ్‌లో హోలీ వేడుకలు జరుపుకున్నారు.

వేములవాడలో..

వేములవాడ: రంగుల పండుగ హోలీ వేడుకలు సోమవారం వేములవాడలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. యువకులు, చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. యువకులు పట్టణ వీధుల్లో బైక్‌లపై తిరుగుతూ రంగులు పూసుకున్నారు. మహిళలు, యువతులు సైతం రోడ్లపైకి వచ్చి ఒకరికొకరు రంగులు పూసుకొని సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలంలోని పల్లెల్లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకున్నారు.

చందుర్తిలో..

చందుర్తి: చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, చిర్రం తిరుపతి, పోంచేట్టి రాకేష్, బాశెట్టి భాస్కర్, తోట మల్లేశం, మల్లయయ్య నాగరాజు, తిరుపతి, సతీష్, యువకులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హోలీ సంబరాలు జరుపుకున్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంతోపాటు మానాల, బడి తండా, దెగవత్ తండా, సర్పంచ్ తండా తదితర గ్రామాలలో చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని యువకులు రంగులు పూసి శుభాకంక్షలు తెలిపారు.



ఇల్లంతకుంటలో ఎస్సైకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



చందుర్తిలో..



వేములవాడలో హోలీ వేడుకల్లో ప్రతాప రామకృష్ణ



వేడుకల్లో ఎంపీపీ పడిగెల మానస



గంభీరావుపేటలో యువకులు

పెద్దగుట్టపై అభివృద్ధి పనులు



భూమి పూజ చేస్తున్న బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ సభ్యులు

చందుర్తి, మార్చి 25 : మండలంలోని లింగంపేట గ్రామ పరిధిలో పెద్దగుట్టపై బుద్ధ విగ్రహం వద్ద అభివృద్ధి పనులు చేపడుతున్నామని చార్వాక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దప్పుల అశోక్ తెలిపారు. గుట్టపైకి వెళ్లడం కోసం మెట్లు నిర్మించడంతోపాటు ఇతర అభివృద్ధి పనుల కోసం సోమవారం ఉపాసకులు కొమ్ము రమేష్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టపై విశాలమైన ప్రదేశంలో 500 మంది కూర్చుండేలా నీడను ఏర్పాటు చేయడం, మినీ వాటర్ ట్యాంకు నిర్మాణం, బోరు నుంచి గుట్ట పైకి పైపుల ద్వారా నీటి సరఫరా పనులు చేపట్టినట్లు చెప్పారు. మే 23 తేదీ వరకు పూర్తి చేయాలని కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీ ఏకగ్రీవం

చందుర్తి మండలం లింగంపేటలో బుద్ధ విహార్ అభివృద్ధి కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ చైర్మన్ దప్పుల అశోక్ తెలిపారు. వైస్ చైర్మన్ గా దయ్యాల కమలాకర్, కోశాధికారిగా డికొండ విజయ్ కుమార్, సలహాదారులుగా, ఉచ్చిది రాజిరెడ్డి, చీటి విద్యాసాగర్ రావు, కోమటిరెడ్డి. వెంకటరెడ్డి, బర్క గోపాల్, వర్కింగ్ మెంబర్స్‌గా ఇందూరి రాములు, ఎన్నాం లింగయ్య, వర్కింగ్ సూపర్ వైజర్‌గా మ్యాకల మునిందర్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

నీటి కోసం మూగజీవాల తిప్పలు

- గ్రామాల్లో నిరుపయోగంగా నీటి తొట్టెలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి పల్లెల్లో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నీటి వసతి లేక ఎందుకు పనికి రాకుండాపోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పశువులు తాగునీటికి అల్లాడుతున్నాయి. నీటి వనరులు ఎండిపోవడంతో మూగ జీవాలకు మురుగు నీరే దిక్కవుతోంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, గుండారం, అక్కపల్లి, దుమాల, నారాయణపూర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో పశువులకు తాగు నీటి తొట్టిలు లేకపోవడంతో మురుగు నీరుతో దప్పిక తీర్చుకుంటున్నాయి. ఫలితంగా వ్యాధుల బారిన పడి పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు, గొర్రెలు, మేకల యజమానులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, నిరుపయోగంగా ఉన్న తాగు నీటి తొట్టెలకు నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

వైభవంగా గంభీర్‌పూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర

కథలాపూర్, మార్చి 25 : మండలంలోని గంభీర్‌పూర్‌లో సోమవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తజనం స్వామి వారి సన్నిధికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వీరు గంటి మాధవాచార్యుల నేతృత్వంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కన గ్రామాలైన తాండ్ర్యాల, బొమ్మెన, బీమా రం మండలం రాజలింగంపేట, రత్నాలపల్లి, ఈదులలింగంపేట, దేశాయిపేట గ్రా మాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. వేము లవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టువస్త్రాలు సమ ర్పించుకుని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ వ్వాజి రేవతిగణేశ్, మాజీ సర్పంచ్ పోతు సింధూజరాజశేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి చౌదరి, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదిరెడ్డి బాపురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

రుద్రంగి మార్చి 25: రుద్రంగి మండల కేంద్రంలోని ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఏటా గంగపుత్ర సంఘం మహలక్ష్మీ వీధి ఆధ్వర్యంలో జాతరను నిర్వహిస్తారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆది శ్రీనివాస్ పూజలు

ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి కల్యాణంలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల ముందు ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆది శ్రీనివాస్‌తో గంగపుత్రులు స్వామివారికి ముడుపు కట్టించారు. దీంతో ఆది శ్రీనివాస్ విజయం సాధించడంతో స్వామివారి కల్యాణంలో భాగంగా ముడుపు విడిపించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, ఇప్ప మహేష్, గంగపుత్ర సంఘం సభ్యులు దేశవేణి దర్శేంధర్, భూమేష్, ద్యావల రవి, ఆర్మూర్ నర్సయ్య, సిరికొండ రవి, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం



ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ ఉదయం కళాకారులు, లక్ష్మీ నరసింహ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి త్యాగరాజ చిత్రపటంతో ప్రదక్షిణాలు, నగర సంకీర్తన చేశారు. అనంతరం శేషప్ప కళావేదికపై ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, బొజ్జ సంతోష్‌కుమార్, మం త్రోచ్ఛరణల మధ్య ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ త్యాగరాజు, చాచం కిష్టయ్య చిత్రపటాలకు పూల మాల వేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం సంగీత విద్వాంసులు పంచరత్న గానాలు ఆలపించారు. కళాకారులను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సన్మానించారు. కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఓరియంటల్ కళాశాల కార్యదర్శి సంగన భట్ల రామకిష్టయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

అక్కపల్లిలో అంధకారం

- పట్టించుకోని సెస్ అధికారులు
- యువకుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో తలెత్తిన సమస్యతో సోమవారం అంధకారం నెలకొంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులు చేయాల్సిన సెస్ అధికారులు పట్టించుకోకపోవడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని యువకులు రాత్రి ఆందోళనకు దిగారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో నెలకొన్న సమస్యతో గ్రామానికి కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి అయినా సరఫరాను పునరుద్ధరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సెస్ అధికారులను సంప్రదిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు యువకులు పేర్కొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: దాడికి పాల్పడడంతోపాటు చంపుతామని బెదిరించిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన నర్సింలు, డేవిడ్‌పై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గుండం జలపతిరెడ్డి గ్రామ శివారులో జీమార్ట్ సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. నర్సింలు, డేవిడ్ బీరు సీసాలతో దుకాణంలోకి వెళ్లి కోడి గుడ్లు కావాలని అడిగారు. కోడి గుడ్లు లేవని జలపతిరెడ్డి పేర్కొనడంతో ఆగ్రహించిన ఇద్దరు అసభ్యపదజాలంతో దూషించారు. అక్కడే ఉన్న పూలతొట్టితో దాడి చేశారు. బాధితుడు జలపతిరెడ్డి ఫిర్యాదుతో నర్సింలు, డేవిడ్‌పై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు వివరించారు.

అదుపు తప్పితే.. అంతే



రెండో బైపాస్‌లో రగుడు వద్ద ప్రమాదకరంగా చెరువు

- రెండో బైపాస్ రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- మైసమ్మ చెరువు వద్ద రక్షణ చర్యలు కరువు
- రెయిలింగ్ లేక వాహనదారుల ఆందోళన

సిరిసిల్ల రూరల్, మార్చి 25: సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న మైసమ్మ చెరువు వద్ద రోడ్డుకిరువైపుల రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనాదారులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలు అదుపు తప్పి పడితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. సిరిసిల్ల రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండల వెంకటాపూర్ వరకు 11 కిలోమీటర్లు రెండో బైపాస్‌లో భాగంగా ఇటీవల ఫోర్‌లైన్ నిర్మాణం చేపట్టారు. అయితే మార్గ మధ్యలో రగుడు గ్రామ శివారులో ఉన్న మైసమ్మ చెరువు కట్టపైనుంచి చంద్రంపేట, జ్యోతినగర్ గ్రామాలకు వెళ్లేందుకు పూర్వం ఏర్పాటు చేసిన రోడ్డు బైపాస్ నుంచి ఉంది. ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న మైసమ్మ చెరువు తూంతోపాటు చెరువు వద్ద రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టిన చేసిన కాంట్రాక్టర్ కేవలం చెరువు కట్టకు బండ్ పనులు చేసి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ మార్గం గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనాదారులు భయంతో వణికిపోతున్నారు. రోడ్డును నిర్మిస్తున్న సమయంలోనే రగుడు గ్రామస్థులతో పాటు ప్రజాప్రతినిధులు రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌తోపాటు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని, ప్రమాదకరంగా ఉన్న చెరువును పరిశీలించాలని, రక్షణ గోడను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.



రెయిలింగ్ లేకుండా ఉన్న చెరువు



రక్షణ గోడ నిర్మించాలి

- బూర నరేష్, రగుడు

రగుడు గ్రామ శివారులో మైసమ్మ చెరువును ఆనుకొని రెండో బైపాస్‌ఫోర్‌లైన్ రోడ్డు నిర్మించారు. చెరువు వద్ద రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించాలి. ప్రమాదాలు జరుగకుండా వెంటనే రక్షణ గోడ నిర్మించాలి.



భయపడుతున్న వాహనదారులు

- సూర దేవరాజు, చంద్రంపేట

రెండో బైపాస్ రోడ్డులో మైసమ్మ చెరువు వద్దకు రాగానే వాహనదారులు భయపడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న అక్కడ రక్షణ గోడను ఏర్పాటు చేయాలి. కాంట్రాక్టర్‌తోపాటు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రమాదాలు జరిగకముందే అధికారులు స్పందించాలి